పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 04.07.2014

పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు చాలా త్వరితగతిన పూర్తి చేసేందుకు, కేంద్రం నుండి రైల్వే ప్రాజెక్టుల కోసం రావాల్సిన నిధులు రప్పించేందుకు, తెలంగాణ రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల ఆధునీకరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సూచించారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ పి.కె. శ్రీవాస్తవ ఇతర ఉన్నతాధికారులతో రైల్వే సంబంధిత అంశాలపై సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం పెండింగులో వున్న ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే తెలంగాణలోని రైల్వే శాఖకు సంబంధించి పెండింగు ప్రాజెక్టులు, సమస్యలు, ప్రతిపాదనలపై ప్రధానికి తాము లేఖ రాశామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై కేంద్రం ఏ విధంగా స్పందిస్తున్నదనే విషయాలను కుడా ఎప్పటికప్పుడు తెలుసుకుని తెలంగాణకు మేలు చేకూర్చే విధంగా చూడాలని కోరారు. మనోహరబాద్ - కొత్తపల్లి రైల్వే లైను, పెద్దపల్లి - నిజామాబాద్ రైల్వే లైను ఏర్పాటు విషయంలో వేగంగా స్పందించాలని కోరారు. కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్ గా మార్చే అంశంపై తాము ఇప్పటికే కేంద్రాన్ని కోరామని, కాజీపేటను డివిజన్ చేసే విషయంలో అధికారులు కూడా చొరవ చూపాలని కోరారు. కాజీపేట ప్రాంతంలో నిర్వహించే వ్యాగన్ ఫాక్టరీ పనులు కూడా ప్రారంభించాలని, రాష్ట్ర విభజన బిల్లులో పొందుపరిచిన కోచ్ ఫ్యాక్టరీకి సంబంధించిన ప్రతిపాదనలు కూడా వాస్తవ రూపం దాల్చే విధంగా అధికారులు పనిచేయాలని కోరారు. వ్యాగన్ ఫ్యాక్టరీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరపున భూమి కేటాయించే విషయంపై అప్పటికప్పుడు వరంగల్ కలెక్టర్‌తో కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. భూమి సిద్దంగా వుందని వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

హైదరాబాద్ నగరంలో రైల్వే ట్రాన్స్‌పోర్టు సిస్టంను బాగా అభివృద్ది చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సమూలంగా మార్చాలని, పూర్తిగా ఆధునీకరించాలని సూచించారు. ఎంఎంటిఎస్ రైళ్లను రెండవ దశలో తూప్రాన్ దాకా పొడగించాలని, ఫలక్‌నామా నుండి శంషాబాద్ వరకు ట్రాక్ నిర్మించి లోకల్ రైలు నడపాలని సూచించారు. నగరంలో అన్ని ఎంఎంటిఎస్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు కనెక్టివిటి ట్రాన్స్‌పోర్టేషన్‌ను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున చర్యలు తీసుకొంటామని ముఖ్యమంత్రి చెప్పారు. మౌలాలి, నాగులపల్లి టర్మినల్స్‌ను బాగా అభివృద్ది చేయాలని చెప్పారు. ఎంఎంటిఎస్ వ్యవస్థను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎలాంటి కార్యక్రమాలు తీసుకోవడానికైనా సిద్దంగా వున్నామని, రైల్వే శాఖ నుండి కావాలసిన అనుమతులు సంపాదించాలని సూచించారు.

---